సంపుటి :03 | సంచిక :47 | పేజీలు :07 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

శనివారం 28, మార్చి 2026



భద్రాద్రిలో అట్టహాసంగా రాముని పట్టాభిషేకం

గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పట్టు వస్త్రాల సమర్పణ

## రాజాధిరాజా రఘువంశ తేజ

06

# అడవి ఆగమాగం

## ఇటీవల కాటారం ఫారెస్ట్‌లో అగ్నికీలలు

- అతికష్టంమీద మంటలార్పిన అటవీశాఖ
- ఆ ఘటన మరువకముందే.. మరో అంశం వెలుగులోకి
- ఇదే డివిజన్‌లో యథేచ్ఛగా చెట్ల నరికివేత
- జిట్రేగి, పెద్దిగి చెట్లను కబళిస్తున్న స్మగ్లర్లు మంటలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ఫారెస్ట్ శాఖ
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సొంత నియోజకవర్గంలో ఈ దందా
- వరస ఘటనలపై నోరు విప్పని మంత్రి
- ఇప్పటికైనా స్పందించి అడవిని కాపాడాలని స్థానికుల విజ్ఞప్తి

భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని నస్తూరుపుల్లి, ప్రతాపగిరి అటవీ ప్రాంతాల్లో ఇటీవల దావానలం పుట్టింది. అది క్రమంగా అడవి అంతటా వ్యాపించింది. అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగడంతో సమాచారం వెంటనే బయటకు రాలేదు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సురేందర్ నేతృత్వంలో బీట్ అధికారులు, బేస్ క్యాంప్ సిబ్బంది ఫైర్ బ్లోయర్స్ సహాయంతో అతికష్టం మీద మంటలను అదుపులోకి తెచ్చారు. మంటల వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేసవి కాలం కావడం వల్ల ఎండిన ఆకులకు పొరపాటున నిప్పంటుకున్నాయా? లేక ఎవరైనా ఆకతాయిలు మంట అంటించారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే, ఇదే అటవీప్రాంతంలో విచ్చలవిడిగా చెట్ల నరికివేత జరుగుతున్నది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలో ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని, దీనిపై ఇప్పటివరకు ఆయన నుంచి ఎలాంటి స్పందన లేదు. మరోవైపు, అడవిలో మంటల ప్రమాదం నుంచి తమకు రక్ ణగా ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– అక్షరదర్బార్, కాటారం

03



# ఆపరేషన్ కగార్ క్లోజ్ !

## ఇవాళ్టికి మూడో రోజు మార్చి 31

## మావోయిస్టు రహిత భారత్ డెడ్‌లైన్ ఇదే

- అంతకు ముందు రోజు లోక్‌సభలో చర్చ
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటనపై ఉత్కంఠ
- ఇప్పటికీ తేలని గణపతి లొంగుబాటు అంశం
- జార్ఖండ్‌లో 60 మంది మావోయిస్టుల కోసం వేట
- 15 వేల మంది బలగాల మోహరింపు
- చివరి అంకం ముగింపు ఎట్లనో?

02



దేశం నుంచి వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకోనుంది. ఈ నెల 30న లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒక కీలక చర్చ పెట్టనున్నారు. దశాబ్ద కాలంగా నక్సలిజం నిర్మూలన కోసం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, సాధించిన విజయాలను ఆయన సభకు వివరించనున్నట్లు తెలిసింది. 'ఆపరేషన్ కగార్' ద్వారా మావోయిస్టు వ్యవస్థను ఏ విధంగా దెబ్బతీశారో గణాంకాలతో సహా వెల్లడించనున్నారు. ఈ నెల 31 నాటికి దేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చాలన్న లక్ష్యం ఏ మేరకు నెరవేరిందో ఈ చర్చ ద్వారా స్పష్టం కానుంది. దేశ అంతర్గత భద్రత విషయంలో ఇది ఒక కీలక మలుపుగా మారబోతోంది. లోక్‌సభ కార్యకలాపాల నిబంధనల ప్రకారం స్వల్పకాలిక చర్చ జరగనుంది. దీనికోసం కొందరు ఎంపీలు ఇప్పటికే స్పీకర్‌కు నోటీసులు ఇచ్చారు. దేశ భద్రతకు సంబంధించిన అత్యంత ప్రాధాన్యత గల అంశంగా దీన్ని పరిగణించిన స్పీకర్ ఓం బిర్లా సోమవారం చర్చకు అనుమతి ఇచ్చారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, పోలీసుల వ్యూహాలు ఏ విధంగా పనిచేసాయో ఈ సందర్భంగా లోతుగా సభ్యులు చర్చించనున్నారు. కేంద్రం తీసుకున్న ఈ చొరవతో మావోయిస్టు రహిత భారత్ ఆవిష్కారం కాబోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

# ఆపరేషన్ కగార్ క్లోజ్!

- ఇవాల్టికి మూడో రోజు మార్చి 31
- మావోయిస్టు రహిత భారత్ డెడ్‌లైన్ ఇదే
- అంతకు ముందు రోజు లోక్‌సభలో చర్చ
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటనపై ఉత్కంఠ
- ఇప్పటికీ తేలని గణపతి లొంగుబాటు అంశం
- జార్ఖండ్‌లో 60 మంది మావోయిస్టుల కోసం వేట
- 15 వేల మంది బలగాల మోహరింపు
- చివరి అంకం ముగింపు ఎట్లనో?



**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

దేశం నుంచి వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా తుడిచి పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకొంది. ఈ నెల 30న లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒక కీలక చర్చ పెట్టనున్నారు. దశాబ్ద కాలంగా నక్సలిజం నిర్మూలన కోసం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, సాధించిన విజయాలను ఆయన సభకు వివరించనున్నట్లు తెలిసింది. 'ఆపరేషన్ కగార్' ద్వారా మావోయిస్టు వ్యవస్థను ఏ విధంగా దెబ్బతీశారో గణాంకాలతో సహా వెల్లడించనున్నారు. ఈ నెల 31 నాటికి దేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చాలన్న లక్ష్యం ఏ మేరకు నెరవేరిందో ఈ చర్చ ద్వారా స్పష్టం కానుంది. దేశ అంతర్గత భద్రత విషయంలో ఇది ఒక కీలక మలుపుగా మారబోతోంది. లోక్‌సభ కార్యకలాపాల నిబంధనల ప్రకారం స్వల్పకాలిక చర్చ జరగనుంది. దీనికోసం కొందరు ఎంపీలు ఇప్పటికే స్పీకర్‌కు నోటీసులు ఇచ్చారు. దేశ భద్రతకు సంబంధించిన అత్యంత ప్రాధాన్యత గల అంశంగా దీన్ని పరిగణించిన స్పీకర్ ఓం బిర్లా సోమవారం చర్చకు అనుమతి ఇచ్చారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, పోలీసుల వ్యూహాలు ఏ విధంగా పనిచేసాయో ఈ సందర్భంగా లోతుగా సభ్యులు చర్చించనున్నారు. కేంద్రం తీసుకున్న ఈ చొరవతో మావోయిస్టు రహిత భారత్ ఆవిష్కారం కాబోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### - గణపతి సంగతేంటి?

మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి లొంగుబాటు అంశం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. వయసు పైబడటం, అనారోగ్య సమస్యల కారణంగా ఆయన జన జీవన స్రవంతిలోకి వచ్చేందుకు సిద్ధమైనట్లు సమాచారం. గణపతి లొంగుబాటు కోసం తెలంగాణ పోలీసులు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటున్నారు. ఆయన తన భార్య రత్నాబాయితో కలిసి పోలీసుల ముందు హాజరయ్యే అవకాశం ఉంది. ఆయన లొంగుబాటుకు అవసరమైన పునరావాస ప్యాకేజీ, భద్రత అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి సైతం కేంద్ర మంత్రి అమిత్ షాతో చర్చలు జరిపినట్లు సమాచారం.

### - సరండా అడవుల్లో వేట

జార్ఖండ్‌లోని సరండా అటవీ ప్రాంతం ఇప్పుడు రణ భూమిని తలపిస్తోంది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మిసిర్ బేస్రా లక్ష్యంగా 15 వేల మంది భారీ బలగాలు గాలింపు చేపడుతున్నాయి. సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ జవాన్లు అడవిని అడుగడుగునా జల్లెడ పడుతున్నారు. బేస్రాతో పాటు సుమారు 60 మంది సాయుధ మావోయిస్టులు ఈ ప్రాంతంలో ఉన్నట్లు నిఘా వర్గాలు నిర్ధారించాయి. వీరి వద్ద ఏకే 47లు, గ్రెనేడ్ లాంచర్లు వంటి భారీ ఆయుధాలు ఉన్నట్లు సమాచారం. మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న ఈ అడవిని బలగాలు నాలుగు వైపుల నుంచి చుట్టుముట్టాయి. అధునాతన డ్రోన్ కెమెరాల ద్వారా వారి కదలికలను నిరంతరం గమనిస్తున్నాయి.

### - నక్సలిజం ముగింపు?

**ఆపరేషన్ కగార్ మావోయిస్టు ఉద్యమాన్ని వేళ్లతో సహా పెకిలించేసింది. గత కొద్ది నెలల్లోనే సుమారు 4 వేల మంది మావోయిస్టులు లొంగిపోయారు. కొందరు ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయారు. పార్టీ చీఫ్ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు, ఇతర అగ్రనేతలు ప్రభాకర్ రావు వంటి కీలక నేతలు బలగాల ధాటికి నిలవలేక నేలకొరిగారు. మార్చ 31 గడువు సమీపిస్తున్న వేళ మిగిలిన వారు కూడా లొంగిపోతారా లేక పోరాడి ముగుస్తారా అనేది తేలాల్సి ఉంది. ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ వరకు ఉన్న దండకారణ్యం ఇప్పటికే మావోయిస్టు రహితంగా మారుతోంది. కేంద్రం గట్టి సంకల్పంతో చేపట్టిన ఈ ఆపరేషన్ దేశ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయిందనడంలో మాత్రం ఏమాత్రం సందేహం అక్కర్లేదు.**

# కొడుకుతో సహా ఎస్సారెస్పీ కాలువలో దూకిన తల్లి

- గాలింపు.. లభించని ఆచూకీ

అక్షరదర్బార్, వర్ధన్నపేట: వరంగల్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. వర్ధన్నపేట మండలంలోని కట్ర్యాల గ్రామ శివారులో కామిండ్ల కళ్యాణి (30) తన మూడేళ్ల కుమారుడు శ్రేయాన్ష్ తో కలిసి ఎస్సారెస్పీ కెనాల్ కాలువలో దూకింది. నాలుగేళ్ల క్రితం ఆమెకు జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ కు చెందిన హరీష్ తో వివాహం జరిగింది. ప్రస్తుతం హరీష్ మామునూరు బెటాలియన్ లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్నాడు. శనివారం కళ్యాణి మామునూరు నుంచి కట్ర్యాల శివారులోకి చేరుకుని మొదట తన కొడుకు శ్రేయన్స్ ను పడేసి తర్వాత ఆమె ఎస్సారెస్పీ కాలువలో దూకింది. సమాచారం తెలియగానే భర్త హరీష్ ఘటన స్థలానికి చేరుకున్నాడు. పోలీసులు స్థానికులు కళ్యాణి కోసం ఎస్సారెస్పీ కాలువలో గాలిస్తున్నారు. రాత్రి వరకు కూడా వారి ఆచూకీ లభించలేదు. కొడుకుతో సహా కళ్యాణ్ ఎస్సారెస్పీ కాలువలో దూకడానికి కారణాలు తెలియాల్సి ఉంది.

# మఫ్టీలో మహిళ ఎస్సై

- పరీక్షా కేంద్రం వద్ద నిఘా
- ఈవ్ టీజింగ్ నివారణకు వినూత్న ఆలోచన



అక్షరదర్బార్, టేకుమట్ల : ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి ఒక మహిళా ఎస్సై వినూత్నం గా ఆలోచించారు. టేకుమట్ల ఎస్సై అమూల్య శనివారం విద్యార్థిని అవతారమెత్తి పరీక్షా కేంద్రం వద్ద మఫ్టీలో నిఘా పెట్టారు. ఉదయం ఎస్సై అమూల్య సాధారణ విద్యార్థినిలా చేతిలో పరీక్ష ప్యాడ్ పట్టుకుని టేకుమట్ల పదోతరగతి పరీక్షా కేంద్రం వద్ద కలియ తిరిగారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడే వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడమే లక్ష్యంగా ఆమె నిఘా పెట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద కొందరు యువకులు విద్యార్థినులను వేధిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఎస్సై రంగంలోకి దిగారు. యూనిఫాంలో ఎలాంటి పోలీస్ బందోబస్తు లేకుండా సామాన్య విద్యార్థినిలా మిగతా విద్యార్థినులతో కలిసి నిఘా పెట్టారు.

# శ్రీవారి దర్శనానికి వెళ్తూ అనంత లోకాలకు

- ఏపీలోని చిత్తూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం
- ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన కారు
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
- మృతుల స్వస్థలం వరంగల్ జిల్లా

అక్షరదర్బార్, వరంగల్ : తిరుపతి వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని ఆ కుటుంబం భావించింది. ఏడుకొండల స్వామి చెంతకు చేరుదామని ఆశగా బయలుదేరిన వారి జీవితాలు మధ్యలోనే కొండెక్కాయి. శ్రీనివాసుడి పాదాల చెంతకు చేరకముందే ఆ కుటుంబం అనంత లోకాలకు చేరుకుంది. దైవ దర్శనానికి వెళ్తున్న వరంగల్‌కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఏపీలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం శేషాపురంలో శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం సంభవించింది. వరంగల్ జిల్లాకు చెందిన శ్రీధర్ రావు కొన్నేళ్ల క్రితం కర్ణాటక రాజధాని బెంగళూరులో స్థిరపడ్డారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమార్తె అద్విక. వీరు ముగ్గురు తిరుమల శ్రీవారి దర్శనానికి శుక్రవారం కారులో తిరుమల బయల్దేరారు. ఈ క్రమంలో తిరుపతి – బెంగళూరు జాతీయ రహదారిపై శేషాపురం వద్ద ఆర్టీసీ బస్సును ఒక కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ముగ్గురూ తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతులను వరంగల్ జిల్లాకు చెందిన శ్రీధర్ రావు, లక్ష్మి, అద్వికగా పోలీసులు గుర్తించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు.

# మైనింగ్ మంటలు

- అసెంబ్లీలో వాడీవేడి చర్చ
- ప్రతిపక్షం టార్గెట్ మంత్రి పొంగులేటి
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్ చుట్టూనే చర్చ
- ఎమ్మెల్యే హరీశ్ తీవ్రమైన ఆరోపణలు
- స్పందించిన సీఎం రేవంత్
- హరీశ్ కుటుంబంపై సంచలన ఆరోపణలు
- విచారించి నిగ్గు తేలుస్తామని ప్రకటన
- సీఎం వ్యాఖ్యలకు ప్రతిపక్ష సభ్యుల వాకౌట్



అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు శనివారం రణరంగాన్ని తలపించాయి. మైనింగ్, ఇసుక తవ్వకాలపై జరిగిన చర్చ ఆరోపణలు, ప్రత్యారోపణల మధ్య తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. తొలుత పోలీసుల సంక్షేమం, బీసీ సబ్ ప్లాన్ వంటి అంశాలపై చర్చ ప్రారంభమైనప్పటికీ.. ఒక్కసారిగా మైనింగ్ అక్రమాల వైపు మళ్లింది. ప్రతిపక్షం ప్రభుత్వంపై విరుచుకుపడగా.. అధికార పక్షం అంతకంటే దీటుగా బదులిచ్చింది. ఇరు పక్షాల మధ్య మాటల యుద్ధం ముదిరి చివరకు సీబీఐ విచారణ ప్రకటన వరకు వెళ్ళింది. సభలో చర్చను మాజీ మంత్రి హరీశ్‌రావు ఒక్కసారిగా మైనింగ్ వైపు మళ్లించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' అక్రమాలకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా క్వారీలు నడుపుతున్నారని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయల గండిపడుతోందని ధ్వజమెత్తారు. "నేను చెప్పింది తప్పయితే నన్ను ఉరితీయండి" అంటూ హరీశ్ చేసిన వ్యాఖ్యలు సభలో ప్రకంపనలు సృష్టించాయి. అక్రమ మైనింగ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పొంగులేటి తక్షణం రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు.

### - సీఎం రేవంత్ ఎదురుదాడి

హరీశ్‌రావు ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ నేతల బ్లాక్‌మెయిలింగ్‌కు భయపడేది లేదని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు స్వయంగా ఇసుక మాఫియా నడిపారని సీఎం సంచలన ఆరోపణ చేశారు. ఆ అక్రమాల వల్లే కేసీఆర్ తన అల్లుడి నుంచి మైనింగ్ శాఖను తీసుకుని కొడుకు కేటీఆర్‌కు అప్పగించారని ఎద్దేవా చేశారు. 2014 జూన్ 2 నుంచి జరిగిన అన్ని మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణ జరిపిస్తామని ప్రకటించారు. సంతోశ్ రావు, రవీందర్ రావుపై కూడా విచారణ జరుపుతామని సీఎం సభలో వెల్లడించారు.

### - నిజాలు నిగ్గు తేలుస్తాం.. మంత్రి శ్రీధర్ బాబు

మంత్రి పొంగులేటిని వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం సరికాదని మంత్రి శ్రీధర్ బాబు హరీశ్‌రావును హెచ్చరించారు. హరీశ్ వ్యాఖ్యలను సభ రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. విచారణకు తాము సిద్ధమని, నిజాలు బయటపడ్డాక ఎవరి సంగతి ఏంటో తెలుస్తుందని స్పష్టం చేశారు. తమ మంత్రులను బెదిరించి లొంగదీసుకోవాలని చూస్తే పప్పులు ఉడకవని అధికార పక్షం తేల్చి చెప్పింది. వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి సీబీడీ నివేదికను సభ ముందు ఉంచుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

### - బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

ప్రభుత్వ సమాధానం దాటవేస్తోందని, పోలీసుల టీఏ, డీఏ బిల్లుల విడుదలపై స్పష్టత లేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. 17 వేల పోలీసు ఉద్యోగాల భర్తీ, బీసీల ఆత్మగౌరవ భవనాల వంటి అంశాలపై మంత్రి నుంచి సరైన భరోసా రావడం లేదని హరీశ్ మండిపడ్డారు. గందరగోళం మధ్యే సభ కొనసాగగా.. మెట్రో రైల్ రెండో దశ విస్తరణకు అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. మొత్తానికి శనివారం అసెంబ్లీ సమావేశాలు మైనింగ్ చుట్టూ అల్లుకున్న రాజకీయ పోరాటంగా నిలిచిపోయాయి.




# అడవి ఆగమాగం

- ఇటీవల కాటారం ఫారెస్ట్‌లో అగ్నికీలలు
- కష్టంపడి మంటలార్పిన అటవీశాఖ
- ఆ ఘటన మరువకముందే.. మరో అంశం వెలుగులోకి
- ఇదే డివిజన్‌లో యథేచ్ఛగా చెట్ల నరికివేత
- జిట్రేగి, పెద్దేగి చెట్లను కబళిస్తున్న స్మగ్లర్లు
- చూసీ చూడనట్లుగా ఫారెస్ట్ శాఖ
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సొంత నియోజకవర్గంలో ఈ దందా
- వరస ఘటనలపై నోరు విప్పని మంత్రి
- అడవిని కాపాడాలని స్థానికుల విజ్ఞప్తి

**అక్షరదర్బార్, కాటారం :**

భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని నస్తూరు పల్లి, ప్రతాపగిరి అటవీ ప్రాంతాల్లో ఇటీవల దావానలం పుట్టింది. అది క్రమంగా అడవి అంతటా వ్యాపించింది. అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగడంతో సమాచారం వెంటనే బయటకు రాలేదు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సురేందర్ నేతృత్వంలో బీట్ అధికారులు, బేస్ క్యాంప్ సిబ్బంది ఫైర్ బ్లోయర్స్ సహాయంతో అతికష్టం మీద మంటలను అదుపులోకి తెచ్చారు. మంటల వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేసవి కాలం కావడం వల్ల ఎండిన ఆకులకు పొరపాటున నిప్పంటుకున్నాయా? లేక ఎవరైనా ఆకతాయిలు మంట అంటించారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే, ఇదే అటవీప్రాంతంలో విచ్చలవిడిగా చెట్ల నరికివేత జరగుతున్నది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలో ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని, దీనిపై ఇప్పటివరకు ఆయన నుంచి ఎలాంటి స్పందన లేదు. మరోవైపు, అడవిలో మంటల ప్రమాదం నుంచి తమకు రక్షణగా ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**- విచ్చలవిడిగా చెట్ల నరికివేత**

కాటారం ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని అడవుల్లో వివిధ రకాల చెట్ల నరికివేత యథేచ్ఛగా సాగుతోంది. మాదారం శివారులోని చింతలాని కంపార్ట్‌మెంట్‌లో ఉన్న నీలగిరి ప్లాంటేషన్ నుంచి వందలాది చెట్లు స్మగ్లర్ల పరం అవుతున్నాయి. స్మగ్లర్లు చెట్లను నరికి ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం అందుతోంది. పెద్దిగి, జిట్రేగి వంటి విలువైన చెట్లను స్మగ్లర్లు నామరూపల్లేకుండా చేస్తున్నారు. ఇంత భారీగా నరికివేత జరుగుతున్నా అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. స్మగ్లర్లకు అటవీ అధికారులకు మధ్య లోపాయికారి ఒప్పందం ఉందా ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**- అగ్నిప్రమాదాలను నివారించాల్సిందే..**

అడవిలో అగ్గి ప్రమాదాలు పర్యావరణ వ్యవస్థకు కోలుకోలేని నష్టం చేకూరుస్తాయి. శాస్త్రీయంగా చూస్తే మంటల వల్ల నేలలో ఉండే సూక్ష్మజీవులు, చిన్న చిన్న జీవులు మరణిస్తాయి. దీనివల్ల నేల సారవంతం కోల్పోయి భవిష్యత్తులో కొత్త మొక్కలు మొలవడానికి ఇబ్బంది అవుతుంది. అటవీ దహనం వల్ల వాతావరణంలోకి అధిక మొత్తంలో కార్బన్ మోనాక్సైడ్, ఇతర విష వాయువులు విడుదలవుతాయి. ఇది గాలి నాణ్యతను దెబ్బతీసి జీవరాశులకు హాని కలిగిస్తుంది. అలాగే వన్యప్రాణుల నివాస ప్రాంతాలు కాలిపోవడం వల్ల అవి జనావాసాల్లోకి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అడవిలోని జీవవైవిధ్యం దెబ్బతిని సహజ సిద్ధమైన పర్యావరణ సమతుల్యం కనుమరుగవుతుంది.

**- చెట్ల నరికివేతతోనూ ప్రమాదమే**

చెట్ల నరికివేతతో పర్యావరణానికి, మానవాళికి ఎంతో హాని కలుగుతుంది. చెట్లు లేకపోతే వాతావరణంలో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతాయి. వర్షపాతం తగ్గి కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. చెట్లు భూమిని పట్టి ఉంచడం వల్ల నేల కోతను అరికడతాయి. ఇప్పుడు చెట్లను నరికేయడం వల్ల వర్షం పడినప్పుడు నేల పైపొర కొట్టుకుపోయి భూమి నిస్సారమవుతుంది. గాలిలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకునే చెట్లు లేకపోతే గ్లోబల్ వార్మింగ్ సమస్య తీవ్రమవుతుంది. ఆక్సిజన్ స్థాయిలు పడిపోయి మనుషులు ఊపిరితిత్తుల వ్యాధులు పెరిగే అవకాశం ఉంది.

**- ఫారెస్ట్ సిబ్బంది ఏం చేస్తున్నారు?**

అడవులను సంరక్షించడం, స్మగ్లర్ల నుంచి చెట్లను కాపాడటం అటవీ శాఖ ప్రాథమిక బాధ్యత. ప్రతి రోజూ అటవీ ప్రాంతంలో గస్తీ నిర్వహించి ఎక్కడా అక్రమ నరికివేత జరగకుండా చూడాలి. కాటారం ఘటనలో అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్లాంటేషన్ నుంచి వందలాది చెట్లు తరలిపోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం. అగ్నిప్రమాదం జరిగినప్పుడు కేవలం పత్రికల్లో వార్త వచ్చిన తర్వాతే స్పందించడం వారి పనితీరుకు నిదర్శనం. అటవీ సంపదను రక్షించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది వైఫల్యం వల్ల స్మగ్లర్లు చెలరేగిపోతున్నారు. ఉన్నతాధికారులు నిరంతరం నిఘా ఉంచి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**- ప్రజాప్రతినిధుల మౌనం**

కాటారం అటవీ ప్రాంతం మంథని నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది. ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ అంశాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సొంత నియోజకవర్గంలో అడవి తగలబడుతున్నా, చెట్లు నరికివేతకు గురవుతున్నా ఆయన అటవీ శాఖను అప్రమత్తం చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్న మంత్రి తన పరిధిలోని అటవీ సంపదను కాపాడటానికి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. స్థానిక నాయకులు, అధికారులు మంత్రికి వాస్తవాలను తెలియజేస్తున్నారా లేదా అనే సందేహాలు కలుగుతున్నాయి. ఇప్పటికైనా మంత్రి స్పందించి అటవీ విధ్వంసాన్ని ఆరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



# డ్రైనేజీ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం

పర్యవేక్షించిన మున్సిపల్ చైర్మన్ సునీల్ కుమార్

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని పలు వార్డుల్లో చేపడుతున్న నూతన డ్రైనేజీ నిర్మాణ పనుల్లో ఎలాంటి రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి చొరవతో టి యు ఎఫ్ ఐ డి సి ద్వారా మంజూరైన నిధులతో 12, 15, 21, 22వ వార్డుల పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతం, పిట్టవాడ, నటరాజ్ టాకీస్ రోడ్, జయ డీలక్స్ రోడ్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను చైర్మన్ స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల పురోగతిని తెలుసుకుంటూ, నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పట్టణ అధ్యక్షుడు కొయ్యాడ శ్రీనివాస్, కౌన్సిలర్లు సుధమల్ల రమేష్, అల్లె దశరథం, బండి శ్రీధర్, కుక్కల విజయ్, కాంగ్రెస్ నాయకులు పొరండ్ల వేణు, గొడుగు నాగరాజు, ఆకుల శ్రీధర్, మున్సిపల్ ఏఈ రోహిత్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఖురేషి, సూపర్వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.

# 30న మొట్లపల్లి సంత వేలంపాట

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామపంచాయతీ వద్ద ప్రతి శనివారం నిర్వహించే కూరగాయల "సంత" లో విక్రయదారుల వద్ద రుసుము వసూలు చేసేందుకు గాను ఈనెల 30న గ్రామపంచాయతీ ఆవరణలో వేలంపాట నిర్వహించనున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి సుజాత సర్పంచ్ నరహరి వెంకట్ రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు ఆసక్తిగల కౌలుదారులు 30వ తారీకు ఉదయం తొమ్మిది గంటలకు వేలంలో పాల్గొనాలని తెలిపారు,

# వయోజనులకు అక్షరాస్యత పరీక్ష

అక్షర దర్బార్ శాయంపేట : ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్ మెంట్ టెస్ట్ ఆదివారం నిర్వహించనున్నట్లు శాయంపేట ఏపిఎం ఎర్రబెల్లి వేణుగోపాలరావు తెలిపారు.ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష రాయవచ్చని తెలిపారు. పరీక్షకు శాయంపేట మండలంలో 22 పరీక్ష కేంద్రాలలో 1400 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. పరీక్షలో విజయం సాధించిన వారికి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ జారీ చేయునట్లు తెలిపారు.

# వేగవంతంగా భూ సర్వే..

- భూ రీ సర్వే (నక్ష) పనులను తనిఖీ చేసిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- వర్ధన్నపేట భవాని కుంట తండాలో నక్ష సర్వే క్షేత్రస్థాయిలో పరిశీలన



అక్షరదర్బార్, వర్ధన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాల పరిష్కారం, యాజమాన్య హక్కుల నమోదు కోసం చేపట్టిన సమగ్ర భూ రీ సర్వే (నక్ష) కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలోని భవానీకుంట తండాలో వివిధ శాఖల అధికారులతో పాటు సర్వే బృందాల సహకారంతో జిల్లా కలెక్టర్ పంట పొలాల్లో నేరుగా పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమగ్ర భూ సర్వేలో భాగంగా జియో కోఆర్డినేట్లు, డ్రోన్ సర్వే, మ్యాపింగ్ సాంకేతికతలను వినియోగించి భూముల హద్దులను ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వేను పూర్తి చేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో నక్ష సర్వే చేపట్టి భూముల హద్దులు, మ్యాపింగ్ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 10,240 ఎకరాల వ్యవసాయ భూమిలో 6,379 ఎకరాలకు రీ సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. మొత్తం 4,652 ఇండ్లకు గాను సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 158 బ్లాకుల్లో 102 బ్లాకుల్లో రీ సర్వే పూర్తయినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా భూముల కొలతల శాఖ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో సుమ, తహసిల్దార్ విజయ్ సాగర్, ఎంపీడీవో వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## పోలీస్ రేంజ్ కార్యాలయ భవనం ప్రారంభం

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ సర్క్యూట్ హౌస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వరంగల్ పోలీస్ రేంజ్ పరిపాలన కార్యాలయ భవనాన్ని శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రారంభించారు. ఈ కార్యాలయంలో వరంగల్ రేంజ్ పోలీస్ అధికారులకు సంబంధించిన శాఖ పరమైన పరిపాలన కార్యకలాపాలు ఈ భవనం నుంచి కొనసాగనున్నాయి. ఈ కార్యాలయంలో సదుపాయాలను సీపీ పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ అధికారుల శాఖపరమైన సమస్యలపై రేంజ్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలని, పరిపాలన పనితీరులో పారదర్శకంగా, బాధ్యతాయుతమైన పని తీరు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు దార కవిత, అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు సురేష్ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్ రావు, రేంజ్ కార్యాలయం సూపరింటెండెంట్ యుగేందర్, ఏసీపీలు సత్యనారాయణ, నర్సింహారావు, సురేంద్రతో పాటు ఆర్ఐలు, ఇన్ స్పెక్టర్లు, రేంజ్ కార్యాలయం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## వైభవంగా ఆలయ పునఃప్రతిష్టాపన

అక్షర దర్బార్, చిట్యాల: శిథిలావస్థకు చేరిన శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని శనివారం చిట్యాల మండలంలోని గుంటూరు పల్లె గ్రామ శివారులో వైభవంగా పునఃప్రతిష్టాపించారు. గ్రామానికి చెందిన మన్నెం లతా–శ్రీనివాస్ దంపతులు రూ.2 లక్షల నిధులు సమకూర్చగా, సర్పంచ్ గుంటుపల్లి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గత 70 సంవత్సరాలుగా ఎలాంటి శుభకార్యం జరిగినా, ముందుగా వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం నుంచి దేవుడికి ఎదురుగా నడిచే ఆనవాయితీ కొనసాగుతోంది. అయితే ఇటీవల రోడ్డు విస్తరణ పనుల వల్ల ఆలయ ప్రాంగణం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు ముందుకు వచ్చి పునఃప్రతిష్టాపన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముద్దేన నాగరాజు, గ్రామస్తులు శివన్నారాయణ, పాశం శంకర్, మన్యం వెంకటేశ్వర్లు, మన్యం శ్రీనివాస్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు

- బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై అత్యాచార కేసులు ఉన్నా చర్య శూన్యం
- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

అక్షరదర్బార్, హనుమకొండ: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు భద్రత కరువైందని, ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులే అనేక లైంగిక వేధింపుల కేసుల్లో ఉన్నారని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆరోపించారు. శనివారం హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె సంచలన విషయాలను వెల్లడించారు. బీజేపీకి చెందిన 44 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు అత్యాచార, లైంగిక వేధింపుల కేసుల్లో ఉన్నారని, వారికి ఆ పార్టీ రాజకీయ రక్షణ కల్పిస్తోందని విమర్శించారు. మహిళల పట్ల గౌరవం లేని పార్టీ బీజేపీ అని మండిపడ్డారు.

### - ప్రధాని మౌనంపై ప్రశ్నలు

స్వాతంత్ర్య దినోత్సవం నాడు మహిళా గౌరవం గురించి




మాట్లాడే ప్రధాని నరేంద్ర మోదీ, దేశంలో మహిళలపై జరుగుతున్న దాష్టీకాలపై ఎందుకు పెదవి విప్పడం లేదని ప్రశ్నించారు. "బేటీ బచావో – బేటీ పఢావో" ప్రకటనల కోసం వందల కోట్లు ఖర్చు చేస్తున్నారే తప్ప, ఆపదలో ఉన్న ఆడబిడ్డలను ఆదుకోవడం లేదని ధ్వజమెత్తారు. ప్రధాని ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి నియోజకవర్గంలోనే గత ఏడాది 1,686 మహిళా నేరాలు నమోదయ్యాయని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. బీజేపీ సీనియర్ నేత సుబ్రమణియన్ స్వామి మహిళా ఎంపీల గురించి చేసిన వ్యాఖ్యలు అత్యంత తీవ్రమైనవని, అయినా ఇప్పటి వరకు ప్రభుత్వం గానీ, మహిళా ఎంపీలు గానీ స్పందించకపోవడం విచారకరమన్నారు. బిల్కిస్ బానో నిందితుల విడుదల, అంకితా భండారీ హత్య కేసు, ఉన్నావ్ అత్యాచార కేసు, ప్రజ్వల్ రేవణ్ణకు మద్దతు వంటి ఘటనలు బీజేపీ ద్వంద్వ నీతిని చాటుతున్నాయని విమర్శించారు.

### - ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ పిలుపు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అన్ని జిల్లాల్లో ప్రెస్ మీట్లు నిర్వహించాలని ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ ఆదేశించిందని ఆమె తెలిపారు. రేపిస్టులను వెనుకేసుకురావడం, విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా అధికారాన్ని కాపాడుకోవాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ, బంక సరళ, సునావత్ రాధా, రాష్ట్ర, జిల్లా మహిళా నాయకులు, మండల, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సంరక్షణకు ఆహార నియమాలు పాటించాలి

అక్షరదర్బార్, హనుమకొండ: నేటి పరిస్థితుల్లో ఆరోగ్య సంరక్షణకు ఆహార నియమాలు పాటించాలని డాక్టర్ హైదర్ అన్నారు. న్యూశాయంపేట జాగీర్ పోచంపల్లి పరిధిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, వరంగల్ వెస్ట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇనుగాల రాధిక ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం 5వ రోజు ఆరోగ్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హైదర్, హెల్త్ సూపర్ వైజర్ మరియా థామస్, శ్రీదేవి, వైద్య సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో ఉండాలని, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీపీఎస్



హెచ్ఎమ్ జి ఉప్పలయ్య, సోని, త్రివేణి, శ్వేత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



## బార్ అసోసియేషన్ నూతన కమిటీకి ఘన సన్మానం

అక్షర దర్బార్, పరకాల: పరకాల కోర్టులో నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కమిటీకి ఘన సన్మానం జరిగింది. అధ్యక్షుడిగా ఎన్నికైన కూకట్ల శ్రీనివాస్ , జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైన పెద్ద బోయిన వేణులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు లక్కం వసంత శంకర్ శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా లక్కం వసంత శంకర్ మాట్లాడుతూ, న్యాయవాదుల సంఘం అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని కోరారు.



## నాగుర్ల పరామర్శ..

అక్షరదర్బార్, పరకాల: కమలాపూర్ మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన లడే సదశివరావు కుమారుడు మణిదీప్ అకాల మరణం చెందగా, తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా మణిదీప్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెండా రాజేష్, పేర్వాల లింగమూర్తి, డా. మోటె చిరంజీవి, మాజీ సర్పంచ్ లడే గోపాల్, లక్ష్మీపురం సర్పంచ్ రాజేష్, నాయకులు లడే రాజేశ్వర్ రావు, గుణాకర్, రవి, సండేసరి రాజేశ్వర్ రావు, బాపురావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే పరామర్శ..

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన సెంట్రల్ వాటర్ కమిషన్ చీఫ్ ఇంజినీర్ పడిదెల దేవేందర్ రావు మాతృమూర్తి పడిదెల సమ్మక్క దశదినకర్మ శనివారం మొగుళ్ళపల్లిలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్ని ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ , మండల బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



## 30న పౌర హక్కుల దినోత్సవం జరపాలి

అక్షర దర్బార్ చిట్యాల : ప్రతి నెల 30న పౌర హక్కుల దినోత్సవాన్ని ప్రభుత్వమే జరిపించాలని అంబేద్కర్ ఫెలోషిప్ నేషనల్ అవార్డు గ్రహీత, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య కోరారు. శనివారం చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు జన్నే యుగేంధర్ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కు వినతి పత్రాన్ని సమర్పించారు ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం ప్రతినెల 30న గ్రామాలలో పౌర హక్కుల దినోత్సవాన్ని జరుపాల, సహ పంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలని అన్నారు. నిర్వహించని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు కార్యదర్శి దాసారపు నరేష్, గురుకుంట్ల కిరణ్ గుర్రపు తిరుపతి నేరేళ్ల రవి పాల్గొన్నారు.




# చిన్నారులకు ‘తొలి ముద్ద’

- బ్రేక్ ఫాస్ట్ పథకం షురూ
- లాంఛనంగా ప్రారంభించిన సీఎం రేవంత్

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల రూపురేఖలు మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. వచ్చే మూడు సంవత్సరాల్లో ప్రతి అంగన్వాడీ కేంద్రం సొంత భవనంలోనే నడిచేలా ప్రణాళికలు సిద్ధం చేయిస్తున్నారు. దీనిలో భాగంగానే శనివారం హైదరాబాద్లోని శాసనసభ సమావేశ హాలులో చిన్నారుల కోసం ఉద్దేశించిన ‘తొలి ముద్ద’ పథకానికి సీఎం శ్రీకారం చుట్టారు. పిల్లల ఎదుగుదలలో మొదటి ఆరు సంవత్సరాలు అత్యంత కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ దశలో సరైన పోషకాహారం అందకపోతే వారి భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో పోషకాహార లోపం వల్ల తలెత్తుతున్న ఆరోగ్య సమస్యలను అరికట్టడానికి ముందస్తు నివారణ చర్యలే మార్గమని సూచించారు. జబ్బులు వచ్చిన తర్వాత భారీగా ఖర్చు చేయడం కంటే, బాల్యంలోనే బలమైన ఆహారం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో విజయవంతం కావాలంటే అంగన్వాడీ సిబ్బంది పాత్ర కీలకమని రేవంత్ రెడ్డి కొనియాడారు. చిన్నారుల ఆకలిని తల్లి ప్రేమతో అర్థం చేసుకుని సేవలందించాలని కోరారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం తన కుటుంబ సభ్యుల్లాగే భావిస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన వెంటనే వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ పాల్గొన్నారు.



## పశువుల నుంచి రక్త నమూనాలు సేకరణ

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలం కొప్పుల గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. రోగ నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా గేద జాతికి చెందిన 10 పశువుల నుంచి, గోజాతి పశువుల నుంచి మరో 10 రక్త నమూనాలను హనుమకొండ జిల్లా పశు రోగ నిర్ధారణ కేంద్రానికి చెందిన డాక్టర్ నాగమణి సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగమణి మాట్లాడుతూ, సేకరించిన నమూనాలను పరీక్షించిన అనంతరం పశువులు ఎలాంటి వ్యాధులతో బాధపడుతున్నాయో గుర్తించి, వాటికి తగిన చికిత్సలు మరియు టీకాలు సూచించేందుకు వీలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సునీల్, సర్పంచ్ మామిడి అశోక్, సిబ్బంది రమేష్‌బాబు, రవి, సదానందం, సుదర్శన్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

# వ్యాయామశాల ఏర్పాటు స్ఫూర్తిదాయకం

అక్షర దర్బార్, చిట్యాల: మండలంలోని చల్లగరిగ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామ ప్రజలు, యువత, క్రీడాకారులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి వ్యాయామశాల ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకంగా మారిందని స్థానికులు ప్రశంసిస్తున్నారు. ప్రభుత్వం నిధుల కోసం ఎదురు చూడకుండా స్వయంగా ముందుకు వచ్చి అందరికీ ఉపయోగపడే విధంగా ఈ వ్యాయామశాల నిర్మాణం చేపట్టడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. చల్లగరిగ గ్రామ ప్రజలు, యువత, క్రీడా పోషకులు, క్రీడాకారుల సహకారంతో సుమారు రూ.1.50 లక్షల వ్యయంతో వ్యాయామశాల ఫ్లోరింగ్ పనులు పూర్తిచేసినట్లు నిర్మాణ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. అలాగే వ్యాయామశాలకు అవసరమైన 18 రకాల పరికరాలను సుమారు రూ.5 లక్షలతో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.



## రైస్ మిల్లర్స్ సమస్యలను పరిష్కరించాలి



అక్షర దర్బార్/ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్, అదనపు కలెక్టర్ మహేందర్ జి చేతుల మీదుగా తెలుగు పరాభవ నామ సంవత్సర నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమం అనంతరం బాదం ప్రవీణ్ కలెక్టర్‌ను కలిసి రైస్ మిల్లర్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా మిల్లింగ్, ధాన్యం కొనుగోలు, చెల్లింపుల ఆలస్యం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలపై స్పందించిన కలెక్టర్ టి.ఎస్. దివాకర్ సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని సానుకూలంగా హామీ ఇచ్చారు.



## ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ కు బీఆర్ఎస్ సన్మానం

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన నిమ్మల సారయ్యను బీఆర్ఎస్ పార్టీ నాయకులు శనివారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మొగుళ్లపల్లి మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి మాట్లాడుతూ... గత పది సంవత్సరాలుగా మండలంలో పాత్రికేయునిగా సేవలందిస్తూ ప్రజలకు నిస్వార్థంగా పనిచేస్తున్న నిమ్మల సారయ్యను మండల పాత్రికేయులు ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకోవడం అభినందనీయమని అన్నారు. ఆయన సారథ్యంలో మొగుళ్లపల్లి ప్రెస్ క్లబ్ భూపాలపల్లి జిల్లాలో ఉత్తమ ప్రెస్ క్లబ్‌గా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొడారి రమేష్, మాజీ జెడ్పిటిసి, పర్లపెల్లి సర్పంచ్ జోరుక సదయ్య పాల్గొన్నారు.



## డమరుకం బహూకరణ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండలం పర్లపల్లి గ్రామంలోని శ్రీ శివ కేశవ దేవాలయంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకల సందర్భంగా గ్రామస్తుల కోరిక మేరకు మండలంలోని పిడిసిల్ల గ్రామానికి చెందిన బజ్జూరి దేవి వీరన్న దంపతులు ఆలయానికి సుమారు 12 వేల రూపాయల విలువగల "డమరుకం"ను బహుమతిగా అందించారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మండ రవీందర్ ఆలయ పూజారి శ్రీపెల్లి శ్రీనివాస్ వీరన్న దంపతులను ఆశీర్వదించి అభినందించారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: కాలిన్స్ ఏరోస్పేస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం మొగుళ్లపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న 190 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు తదితర స్టేషనరీ సామగ్రిని సంస్థ ప్రతినిధులు రామారావు, విశాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులో రాణించేందుకు ప్రతి సంవత్సరం తమ సంస్థ తరఫున సహాయం అందిస్తున్నామని తెలిపారు. పాఠశాలలకు అవసరమైన సదుపాయాలను కల్పించడంలో ముందుంటామని, మరిన్ని అవసరాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు భాగ్యశ్రీ, ఫిజికల్ డైరెక్టర్ రాజయ్య మాట్లాడుతూ గతంలో అందించిన క్రీడా సామగ్రి వల్ల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిల్,రాజు, ప్రవీణ్ ,విజయభాస్కర్, కళ్యాణ్ ఉన్నారు.






# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : aksharadarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915